# నా మాట నమ్మండి

రచన : శ్రీ దివాకర్ల సన్యాసిరాజు

'ఏయ్ ! ఎవరు మీరు ? అర్ధరాత్రి పూట ఏమిటీ గోల ?'

'బాబ్బాబు! ఈ రోజుకి కొంచెం తల దాచుకోనివ్వండి. రేపు చీకటిపడగానే వెళ్ళిపోతాం.'

'వీల్లేదు. యిప్పటికే మేం ఎక్కువైపోయాం. కొత్తవారి కిక్కడ చోటులేదు.'

నిద్రాదేవత మెత్తని వడిలో మత్తుగా నిద్రపోతున్న నాకు పై మాటలతో తెలివచ్చింది. మెల్లగా కళ్ళు విప్పేసరికి ఫక్కున నవ్వాయి-నక్షత్రాలు. రాత్రి పదకొండో-పన్నెండో కావచ్చు.

మళ్ళీ మాటలు వినబడసాగాయి.

'ఏం పొమ్మంటే మీకొక్కడూ చెప్పేది.'

'తెల్లారిపోతోంది-ఎక్కడికి పోతాం. కొత్తవాళ్ళం - మాకీ వూరు తెలీదు. ఈ ఒక్కరోజుకి తలదాచుకోనివ్వండి.'

'లేదు పొమ్మంటే ఏంవిటోయ్ ఆ మొండితనం. మేమే పెళ్ళాం పిల్లలతో కాపరముంటున్నాం - ఏభై ఏళ్ళయింది - ఈ వృక్షాన్ని ఆశ్రయించి మాకే చాలడంలేదు.'

'అదేమిటయ్యా! అలా కొట్టి పారేస్తావ్. ఈయన ఘనం పెద్ద రాజకీయ నాయకుడు. దిగితే కారు, ఎక్కితే కారు - పెద్ద పోలీసు బందోబస్తు-అదీ ఎంత అట్టహాసంగా ఉండేదో తెలుసా!

'అయితే ఏంటంటావ్-యిక్కడ మినిస్టర్లు, డాక్టర్లు భేదం లేదయ్యా. అంతా ఒకటే. ఆమాటకొస్తే నేనో పెద్ద జమీందారు కొడుకుని. యిక్కడ ఆ హోదాలేం పనికిరావు.'

—ఆ మాటల అర్థం నాకు బోధపడలేదు. చుట్టూ చూశాను. ఎవరూ కనపడలేదు. పాతిక గజాల దూరంలో ఉన్న చింత చెట్టుపై పడింది నా దృష్టి.

భయంకరంగా శబ్దంచేస్తూ వూగుతున్నాయి కొమ్మలు. మాటలుకూడా అటునుంచే వినబడసాగాయి. ఎవరివా మాటలు- ఒక వేళ ........అమ్మ బాబోయ్ - నాతో పాటు మంచంకూడా వణికింది-కిర్రు...కిర్రుమంటూ. సెరకపోయి బయట పడుకున్నాను. అత్తయ్య చెప్పనే చెప్పారు. పైన - ఆరుబయట పడుకోవద్దని-రాక రాక అత్తగారింటికొచ్చి చల్లగా ఉంటుందని వాకిట్లో మంచం వేయించుకొని పడుకొంటే ఈ భాగోతం మొదలైంది. లేచి యింట్లోకి పోదామంటే ఎందుకు భయం-మెడ వరకూ కప్పుకొని కళ్ళు చెట్టువైపు తిప్పాను. ఆకారాలు కనపడలేదు గాని మాటలు వినిపిస్తున్నాయి.

'మనలో మనం ఎలాగా సర్దుకుపోవాలి. చాలా దూరంనుండీ వస్తున్నాం. చింత చెట్లు మనకి శ్రేష్ఠమైనవి, నివాసయోగ్యమైనవి.

దార్లో ఎంత వెదికినా మచ్చుకైనా కనపల్లేదు చింతకఱ్ఱా బొగ్గు శ్రేష్ఠమని కనపడ్డ చెట్టునల్లా నరికిపారేస్తున్నారు - కొంచెం చోటిప్పించండి.'

'అసలు మీ రెవరు?'

'ఈయన పెద్ద రాజకీయ నాయకులని సెప్పాగా. ఈయనకి ఎగినిష్టుగా మరో పార్టీ ఉంది. రాత్రి ఈయని బలంకొద్దీ ఒక్క దెబ్బ కొట్టాను. తక్కున క్రిందపడ్డాడు. పారిపోతూంటే నన్నో దొంగవీనుగ పట్టేశాడు. జైల్లో పెట్టేసి, ఆ తరవాత చచ్చి స్వర్గానికి పోతూంటే, దార్లో ఈయన కనబడి, 'ఓరేయ్ అప్పిగా, ముందు స్వర్గానికి వెళ్ళకూడదురా. నరకాని కెళ్ళాలి. కొన్నాళ్ళు యిక్కడ అన్నీ చూసి, తరవాత వెల్దాం. నాకు తోడుగా రా' అంటూ తీసుకొచ్చారు. ఈ రోజుకి ఉండనివ్వండి బాబూ.'

'అదా సంగతి. రాజకీయ గొడవలా, మీలాంటివాళ్ళని అసలు ఉండనివ్వం. మేమంతా తిండిలేక చచ్చినవాళ్ళం. తిని, తీరుబడిగా దొమ్ములాడుకొని చచ్చినవాళ్ళంటే పరమ అసహ్యం మాకు. పొండి...పొండి.'

జూయ్ మంటూ ఈదురుగాలి మొదలైంది, సందేహం లేదు - దెయ్యాలే అవి. అయితే మా అత్తయ్యవారింటి ఆవరణలోనున్న చింత చెట్టుమీద ఓ దెయ్యాలవారి కుటుంబం ఉందన్నమాట - దెయ్యాలు కూడా, ఆడదెయ్యాలు, మగదెయ్యాలు, పిల్లదెయ్యాలు, ముసలిదెయ్యాలు అవి కాపరాలు ఉంటాయన్నమాట

అదే సమయంలో మరో నాలుగైదు కంఠాలు వినబడ్డాయి.

'ఏమటయ్యా! ఎందుకు దెబ్బలాడుకుంటున్నారు?'

'సూడండి బాబూ! ఈ లచ్చిగారి సెట్టంట యిది. ఈయ్యాలకి చోటిమ్మంటే పొమ్మంటున్నారు.'

'మేమూ అందుకే వచ్చాం. కొత్తవాళ్ళం,




Manufacturing ¼ H.P. 20 H.P.,—3 Phase RPM Motors 960, 1450 & 2890 Monoblock set 2 H.P. to 20 H.P.3 Phase ½ HP. to 2 H.P.

*Dealers in Madras City:*—UNITED AGENCIES
96, Arminian Street, Madras-1.
POPULAR ELECTRICALS,
329, Thambu Chetty St, Madras-1.
Sole Agents for Eastwhile Hyderabad &
Maharashtra State, M/s. Vijai, Agencies
24, Market Road, Secundarabad-3.
*Agents for Cuddappah Dt:*—
M/S. V. S. REDDY & CO.,
4/192, Dr. Ayyaswami Pillai St.,
Cuddapah (A.P.)

బస్సు తిరగబడి, నలుగురం ఒక్కసారే చచ్చాం. మాకూ చోటివ్వాలి. ఏవయ్యా! ఉండనిస్తారా లేదా?'

'ఏంటయ్యోయ్! మీ తాతగారి చెట్టులా, దమాయిస్తున్నారు. వాళ్ళిద్దరికే చోటు లేదంటే మీ నలుగురికీ ఎక్కడనుండి తేవడం?'

'తిరిగి తిరిగి అలసిపోయాం. ఏదో ఓ మూల కొమ్మని వేలాడతాం. ఒకప్పుడు బాగా బ్రతికినా యిప్పుడంతా ఒకటే కదా!'

'ఫో...ఫో...వయ్యా! పెద్దనీతులు చెప్పొచ్చాం-చింత చచ్చినా పులుపు చావలేదు. మీరు అరిచి గీపెట్టినా యిక్కడ జాగాలేదు.'

'అయితే ఎక్కడికి పోవాలి.. ఈ...'

'వల్లకాట్లోకి-కాకపోతే, వచ్చిందిక్కడకు నన్నడుగుతారేం ?'

'వోయ్! మాటలు తిన్నగా రానీ. ఈలిప్టి గాడి సంగతి నీకు తెల్దు. నా దెబ్బ చవిచూశారు అతన్నడుగు.'




'తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు జడవ్వోయ్ లిప్టిగా.'

'ఏట్రోయ్! వూరుకుంటూంటే రెచ్చిపోతున్నావ్!'

—పెద్ద గాలి చెలరేగింది. మరో క్షణం ఉన్నానంటే నేనూ మంచంతోపాటు గగన విహారం చేసేవాడ్నేమో. మంచంతోపాటు గుండెల్నికూడా గట్టిగా పొదివి పట్టుకొని యింట్లోకి పరుగెత్తాను.

♦ ♦ ♦

ఉదయం లేచి బయటకొచ్చేసరికి నా ఆశ్చర్యం అంచులు దాటింది. తూర్పు వైపు ఉన్న చింతచెట్టు కొమ్మ విరిగిపడి ఉంది - చిందరవందరగా.

'రాత్రి పెద్ద గాలివాన వచ్చింది. అందుకే చెట్టు కొమ్మ విరిగిపోయింది -' అన్నారు మావయ్య.

'కాదండీ! రాత్రి దెయ్యాలు దెబ్బలాడుకున్నాయి. ఆ జమీన్ దారు పార్టీ విరగ్గొట్టేసి ఉంటుంది' అన్నాను.

'ఛ...ఛా!... దెయ్యాలేమిటి విరగ్గొట్టడమేమిటి? గాలివానకి పడిపోయింది-' అన్నారు అత్తయ్య.

కాదు మొర్రో-అంటే నమ్మరేం. పోనీ చదువుతున్నారు మీరైనా నమ్ముతారా - దెయ్యాలేనని.

★